సాక్షి కామారెడ్డి

శనివారం । 10 । మే । 2025



అక్రమాలను సహించను

సంక్షేమ పథకాల అమలులో అక్రమాలను సహించబోనని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హెచ్చరించారు.

- 10లో ▸



మందుల్లేవు.. వైద్యులు రారు

ఆరోగ్యభద్రత ఇస్తాయనుకున్న ఈఎస్ఐ ఆస్పత్రులు మందులు లేక, టైమ్‌కు వైద్యులు రాక వెలవెలబోతున్నాయి.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.4 /22.0

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రూ. 2.10 కోట్ల రుణాలు రికవరీ



లింగంపేట: శెట్పల్లిసంగారెడ్డి సొసైటీ పరిధిలో రైతులకు ఇచ్చిన దీర్ఘకాలిక రుణాలు రూ. 2.10 కోట్లు రికవరీ చేసినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ లింబాద్రి తెలిపారు. శుక్రవారం ఆయన శెట్పల్లిసంగారెడ్డి సొసైటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ నుంచి రైతులకు రూ. 6.70 కోట్ల దీర్ఘకాలిక రుణాలు ఇవ్వగా అందులో 2024–25 సంవత్సరానికి రూ. 2.10 కోట్లు వసూలయ్యాయన్నారు. మండలంలోని లింగంపేట, నల్లమడుగు సొసైటీల కంటే ఎక్కువగా రుణాలు రికవరీ అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో లింగంపేట సహకార బ్యాంకు మేనేజర్ కుమార్ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో 130 సెల్‌ఫోన్‌ల రికవరీ



కామారెడ్డి క్రైం: జిల్లాలో సెల్‌ఫోన్ పోయిందనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో సీఐ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఆర్‌ఎస్సై, 10 మంది కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి 3 రోజుల్లోనే 130 ఫోన్‌లను రికవరీ చేశామని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్లను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. లేకపోతే వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలిగే అవకాశాలు ఉంటాయన్నారు. వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేసి కొత్త సిమ్ కార్డు తీసుకోవాలని సూచించారు. ఇలా చేస్తే పోయిన సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ విధానంలో రికవరీ చేసేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. రికవరీ చేసిన ఫోన్‌ల వివరాలను బాధితులకు తెలియజేశామన్నారు. సమాచారం లేని వారు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్‌ఎస్సై బాల్‌రాజు (8712686114) ను సంప్రదించాలని సూచించారు.

బాన్సువాడ డీఎస్పీగా విఠల్‌రెడ్డి



బాన్సువాడ : బాన్సువాడ డీఎస్పీగా విఠల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బాన్సువాడలో డీఎస్పీగా పనిచేసిన సత్యనారాయణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్గొండ పోలీస్ ట్రెయినింగ్ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేసిన విఠల్‌రెడ్డి వచ్చారు. శుక్రవారం సత్యనారాయణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాన్సువాడ టౌన్, రూరల్, బిచ్కుంద సీఐలు, డివిజన్‌లోని ఎస్సైలు నూతన డీఎస్పీని కలిశారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

కామారెడ్డి అర్బన్: జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ పథకాల ద్వారా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడానికి కార్యాచరణ రూపొందించామని జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి తెలిపారు. పండ్ల తోటల పెంపకంతోపాటు మల్చింగ్, నీటి కుంటలు, ఉద్యాన యాంత్రీకరణ, సూక్ష్మసేద్యం, గట్లపై వెదురు సాగు, 2,500 ఎకరాల్లో ఆయిల్ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 2 వేల ఎకరాలకు సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. పూర్తి వివరాలకోసం కామారెడ్డి, బీబీపేట, దోమకొండ, రాజంపేట, మాచారెడ్డి, పాల్వంచ, భిక్కనూరు మండలాల రైతులు 89777 14030లో సంప్రదించాలన్నారు. ఎల్లారెడ్డి, లింగంపేట, తాడ్వాయి, గాంధారి, రామారెడ్డి, సదాశివనగర్, నాగిరెడ్డిపేట మండలాల రైతులు 89777 14022 నంబర్‌లో, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల రైతులు 89777 14029 నంబర్‌లో సంప్రదించాలని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

అశ్రునయనాలతో..

- పాల్వంచలో గ్రేహౌండ్స్ జవాన్‌కు అంతిమ వీడ్కోలు
- నివాళులర్పించిన మంత్రి పొన్నం, షబ్బీర్, మదన్‌మోహన్‌రావు
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు





పాల్వంచలో శ్రీధర్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) మృతుడు శ్రీధర్ (ఫైల్)

కామారెడ్డి క్రైం/మాచారెడ్డి : నక్సల్స్ అమర్చిన మందుపాతరకు బలైన గ్రేహౌండ్స్ జవాన్ వడ్ల శ్రీధర్ అంత్యక్రియలు శుక్రవారం పాల్వంచ మండల కేంద్రంలో అధికార లాంఛనాలతో జరిగాయి. పాల్వంచ గ్రామస్తులే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు తరలి వచ్చి జవాన్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర ఆధ్వర్యంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయగా.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి తదితరులు శ్రీధర్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

భారీగా తరలివచ్చిన జనం...

ములుగు జిల్లా కర్రిగుట్టల్లో నక్సల్స్ అమర్చిన మందుపాతర గురువారం ఉదయం పేలడంతో గ్రేహౌండ్స్ జవాన్ వడ్ల శ్రీధర్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వరంగల్‌లో పోస్టుమార్టం పూర్తయిన తరువాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహం రాత్రికి పాల్వంచకు చేరుకుంది. శుక్రవారం ఉదయం నుంచే శ్రీధర్ ఇంటికి వేలాది మంది ప్రజలు చేరుకుని కన్నీటి నివాళులర్పించారు. అందరితో కలుపుగోలుగా ఉండే శ్రీధర్ మరణవార్త గ్రామస్తులను కలచివేసింది. ఉదయం గ్రామంలో ఆయన ఇంటి వద్ద ప్రారంభమైన అంతిమయాత్ర ప్రధాన వీధుల మీదుగా సాగింది. శ్రీధర్ స్నేహితులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు, పోలీసులు శ్రీధర్ అమర్‌రహే, జై జవాన్, భారత్‌మాతాకీ జై అంటూ నినదించారు. గ్రామ శివారులోని శ్మశానవాటికలో మృతదేహాన్ని ఖననం చేశారు. ఆయన సోదరుడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పోలీసులు తుపాకులు పేల్చి గౌరవవందనం చేశారు. శ్రీధర్ తల్లి లక్ష్మి, భార్య శ్రీవాణిల రోదనలతో అక్కడి వారి హృదయాలు ద్రవించాయి.

అంత్యక్రియలలో గ్రేహౌండ్స్ కమాండర్ (ఆపరేషన్స్) రాఘవేందర్‌రెడ్డి, ఓఎస్‌డీ దయానంద్, డీఎస్పీ శంకరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చర్చలతోనే సమస్యకు పరిష్కారం

శాంతి చర్చలతోనే మావోయిస్టుల సమస్యకు పరిష్కారం లభిస్తుందని మంత్రి పొన్నం పేర్కొన్నారు. శ్రీధర్‌కు నివాళులు అర్పించి, బాధిత కుటుంబాన్ని ఓదార్చిన అనంతరం ఆయన మాట్లాడారు. పెళ్లయిన 8 నెలలకే శ్రీధర్ మృతి చెందడం బాధాకరం అన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.2.17 కోట్లతో పాటు 300 గజాల స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని పేర్కొన్నారు.



శ్రీధర్ భార్యను ఓదారుస్తున్న మంత్రి పొన్నం

కొవ్వొత్తులతో నివాళి



పాల్వంచలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

మాచారెడ్డి: శ్రీధర్ ఆత్మశాంతి కోసం పాల్వంచ గ్రామస్తులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్ర పటం వద్ద కొవ్వొత్తులు ఉంచి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్, ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



సాక్షిపై కక్ష సాధింపు సరికాదు

ఎల్లారెడ్డి: సాక్షి దినపత్రికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదని జర్నలిస్టులు పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై ఏపీ పోలీసుల దాడిని శుక్రవారం ఎల్లారెడ్డి జర్నలిస్టులు ఖండించారు. నిజాలను బయట పెడుతున్న సాక్షి పత్రికపై తెలుగుదేశం ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. అనంతరం ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఏవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎన్‌యూజే జాతీయ ఉపాధ్యక్షులు రాజేందర్‌నాథ్, జర్నలిస్టులు రామప్ప, మహేష్, సిద్ధు, యశ్వంత్ పవార్, సంగ్రాం, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, రాజ్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన గళమెత్తిన జర్నలిస్టులు

నిజామాబాద్‌అర్బన్: సెర్చ్ వారెంట్ లేకుండా 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించడం సరైంది కాదంటూ జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనంజయరెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లాలోని అన్ని జర్నలిస్టు సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపాయి. సుమారు రెండు గంటలపాటు జర్నలిస్టులు ఈ నిరసనలో పాల్గొన్నారు. మీడియాపై ఆంక్షలు విధించడం, అక్రమ కేసులు నమోదు చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రవేశ మార్గం నుంచి నిరసన ప్రదర్శనగా వెళ్లి అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర నాయకుడు జమాల్‌పూర్ గణేశ్, ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొబ్బిలి నర్సయ్య, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు రామకృష్ణ, ప్రమోద్‌గౌడ్, రవికుమార్, మోహన్, ధనుంజయ్, రామ్‌చందర్, సదానంద్, పంచరెడ్డి శ్రీకాంత్, దేవల్ రవిబాబు, ఇంగు శ్రీనివాస్, ఉమామహేశ్వర్, కొక్క రవి, ఆంజనేయులు, జాన్సన్, సురేశ్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి ప్రభాకర్, సాక్షి టీవీ వీడియో జర్నలిస్ట్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

కామారెడ్డి క్రైం: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) రంగం పనితీరును మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం 'ర్యాంప్' (రెయిజింగ్ యాక్సెలరేటింగ్ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ పర్ఫార్మెన్స్) అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం లాల్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాంప్ నిర్వహణ కోసం ప్రతి జిల్లాకు రెండు పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన కేటాయించిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లాలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు శనివారంతో ముగుస్తుందని తెలిపారు. మేనేజ్‌మెంట్, కామర్స్ లలో ఏదైనా డిగ్రీ గానీ, ఇంజినీరింగ్ గానీ పూర్తి చేసిన వారు అర్హులని, ఇతర వివరాలకు www.nimsme.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సమ్మర్ ప్రత్యేకం!

- వేసవి సెలవుల్లో విద్యార్థులకోసం ప్రత్యేక శిక్షణ శిబిరాల ఏర్పాటు
- జిల్లాలో 28 పాఠశాలల ఎంపిక
- 15 రోజులపాటు కొనసాగనున్న శిక్షణ

నాగిరెడ్డిపేట : వేసవి సెలవుల్లో విద్యార్థులకు వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చేందుకు అధికారులు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం జిల్లాలో 28 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో అంశంపై శిక్షణ ఇస్తున్నారు. 15 రోజులపాటు ఈ శిబిరాలు కొనసాగనున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు.

ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

విద్యార్థులకు ఆయా అంశాలలో శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. 15 రోజులపాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు గౌరవవేతనం కూడా చెల్లించనున్నారు. దీంతోపాటు మూడు గంటలపాటు శిక్షణ పొందే విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు కొంతబడ్జెట్‌ను కేటాయించారు. సమ్మర్ క్యాంప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు.

శిక్షణ అంశాలు..

స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్స్ బేసిక్స్, కరాటే, డ్రాయింగ్, ఆర్ట్ ఎడ్యుకేషన్, యోగా, అథ్లెటిక్స్ అండ్ వాలీబాల్, అబాకస్, డ్యాన్స్, స్పోర్ట్స్–యోగా, మెడిటేషన్, ఖోఖో, మార్షల్ ఆర్ట్స్, కబడ్డీ, ఇంగ్లిష్ గ్రామర్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.



గోపాల్‌పేట మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ బేసిక్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

చట్ట ప్రకారమే అర్జీలను పరిశీలించాలి

- ఇప్పటివరకు 1,443 దరఖాస్తుల పరిశీలన
- మిగతావాటిని త్వరగా పరిష్కరించాలి
- రెవెన్యూ బృందాలతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

లింగంపేట : భూభారతి చట్ట ప్రకారమే రైతుల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం ఆయన లింగంపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ బృందాల సమావేశంలో మాట్లాడారు. గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు లింగంపేట మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. భూములకు సంబంధించిన సమస్యలపై 4,225 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించడానికి తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వారు ఇప్పటివరకు 1,443 దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేసి భూములను పరిశీలించారన్నారు. మిగతావాటిని కూడా త్వరగా పరిశీలించాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో సంయుక్త సర్వే చేపట్టాలన్నారు. దీర్ఘకాలిక సమస్యలను సైతం పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో ప్రభాకర్, భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్, ల్యాండ్ సర్వే సహాయ సంచాలకులు శ్రీనివాస్, అటవీ అభివృద్ధి అధికారి రామకృష్ణ, తహసీల్దార్లు, రెవెన్యూ, అటవీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

టమాట ధర ఢమాల్

- 25 కిలోల బాక్స్‌కు రూ.100 మాత్రమే..
- నష్టపోతున్న రైతులు



రాజంపేట : జిల్లాలో టమాట ధరలు భారీగా పతనమయ్యాయి. మార్కెట్ బీట్‌లో 25 కిలోల టమాట బాక్స్ రూ.100 నుంచి రూ.120 వరకు పలుకుతోంది. దీంతో రైతులు నష్టపోతున్నారు. కాగా రిటైల్ వ్యాపారులు మాత్రం కిలో టమాటను రూ. 10 ల చొప్పున విక్రయిస్తున్నారు.

రాజంపేట మండలంలోని శివాయిపల్లి, బస్వన్నపల్లి, ఆర్గొండ, పెద్దాయిపల్లి గ్రామాల రైతులు ఎక్కువగా టమాటను సాగు చేశారు. ప్రస్తుతం పంట తొలి కాత చేతికొస్తుండగా.. ఆరంభంలోనే ధర పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో 25 కిలోల టమాట బాక్సు ధర సుమారు వెయ్యి రూపాయల వరకు పలికింది. ఈసారి కూడా ఆ స్థాయిలో ధర లభించవచ్చన్న ఆశతో రైతులు ఈ పంట సాగు చేశారు. అయితే ధర నిరాశాజనకంగా ఉండడంతో నష్టపోతున్నామని పేర్కొంటున్నారు. ధర పడిపోతుండడంతో టమాట కోసే బదులు దున్ని వేయడమే మేలని పలువురు భావిస్తున్నారు.

గిట్టుబాటు కావడంలేదు



నేను రెండు ఎకరాల్లో టమాట సాగు చేస్తున్నా.. పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. మార్కెట్లో ధర లేదని చెప్తూ వ్యాపారులు 25 కిలోల టమాట పెట్టెను 100 రూపాయలకే కొంటున్నారు. కనీసం కూలి డబ్బులు కూడా రావడం లేదు.

– గురువారెడ్డి, రైతు, శివాయిపల్లి

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

లింగంపేట: పర్మళ్లలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో జొన్నలకు క్వింటాల్‌కు రూ. 3,371 మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల పేర్లపై దళారులు జొన్నలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజు, లింగంపేట సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పర్మళ్లలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత

క్లుప్తంగా

హుటాహుటిన విధుల్లోకి వెళ్లిన మద్నూర్ జవాన్



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ బండివార్ పరుశురాం మిలటరీ ఉన్నత అధికారుల ఆదేశాలతో శుక్రవారం హుటాహుటిన విధుల్లో చేరేందుకు తరలివెళ్లారు. భారత్–పాక్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో అత్యవసర పరిస్థితులతో విధుల్లోకి చేరినట్లు పరుశురాం కుటుంబ సభ్యులు తెలిపారు. పరుశురాం ఈ నెల 2న మద్నూర్‌కు సెలవులపై వచ్చాడని, ఈ నెల 30వ తేదీ వరకు సెలవులు ఉండగా హఠాత్తుగా బయలుదేరి వెళ్లినట్లు వారు తెలిపారు.

భారత సైన్యానికి మద్దతుగా పూజలు



మద్నూర్/భిక్కనూరు : భారత సైన్యానికి మద్దతుగా పలు చోట్ల ప్రజలు పూజలు నిర్వహించారు. మద్నూర్ మండలం సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శుక్రవారం భారత సైన్యానికి మద్దతుగా ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భిక్కనూరు శ్రీసిద్దరామేశ్వరాలయంలో శుక్రవారం పూజలు చేశారు. పూజారులు రామగిరిశర్మ,రాజేశ్వరశర్మలు స్వామివారికి ఈ విషయమై ప్రత్యేక అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. సైనికులపై స్వామి వారి పరిపూర్ణమైన అనుగ్రహం కలుగ చేసి వారిని కాపాడాలని వేడుకున్నారు.



సమష్టి కృషితో శతశాతం ఫలితాలు



లచ్చాపేట పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

- ఉమ్మడి మాచారెడ్డి మండలంలో 11 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత
- పది ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు

మాచారెడ్డి : ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషితో ఉమ్మడి మాచారెడ్డి మండలంలో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రత్యేక తరగతులు, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వెరసి 517 మంది విద్యార్థులకు గాను 512 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా, మరో ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో వందశాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో మాచారెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన సబా తబస్సుం అనే విద్యార్థిని 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఇసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వైష్ణవి 578 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. అదే పాఠశాలకు చెందిన నిఖిత 575 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. 14 ఉన్నత పాఠశాలలకు గాను 11 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థుల కృషితో పాటు ఉపాధ్యాయుల ప్రోత్సాహం ప్రత్యేక తరగతులతో ఉత్తీర్ణత సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

విద్యార్థులను ప్రోత్సహించాం

ప్రతి రోజూ పాఠశాలకు హాజరుకావాలని విద్యార్థులను ఎల్లవేళలా ప్రోత్సహించాం. నెలలో 30 రోజులు హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేశాం. అలాగే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శ్రద్ధతో చదివేట్టు కృషి చేశాం. దీంతో విద్యార్థులు వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

– దేవేందర్‌రావు, ఎంఈవో, మాచారెడ్డి

వేకప్ కాల్‌తో మొదలుపెట్టాం



పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్న క్రమంలో ఉదయం నాలుగు గంటలకే కాల్ చేసి నిద్ర లేపాం. అలాగే రోజుకో ఉపాధ్యాయుడి చొప్పున విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలించాం. దీంతో 32 మంది విద్యార్థుల ఇళ్లలోకి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాం. పిల్లల చదువు గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుని కఠినమైన సబ్జెక్టులపై శ్రద్ధకనబరిచే విధంగా కృషి చేశాం.

– రాజేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం, లచ్చాపేట

విద్యార్థులను దత్తత తీసుకున్నాం



ఒక్కో విద్యార్థిని ఒక్కో ఉపాధ్యాయుడు దత్తత తీసుకుని వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి కఠినమైన సబ్జెక్టులపై దృష్టి సారించాం. ఉదయాన్నే వేకప్ కాల్స్ చేసి శ్రద్ధగా చదివేలా కృషి చేశాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారికి కలిగే సందేహాలు తీరుస్తూ స్లిప్ టెస్ట్‌లు నిర్వహించాం. శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేశాం.

– వెంకటాచారి, హెచ్‌ఎం, మాచారెడ్డి

ఉపాధ్యాయుల కృషితో



ప్రధానోపాధ్యాయులు వెంకటాచారి, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాను. సబ్జెక్టుల వారీగా ఎలాంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయులు తీర్చేవారు. అలాగే మా తల్లిదండ్రుల కృషితోనే మండల టాపర్ నిలిచాను. హెచ్‌ఎం వెంకటాచారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు.

– సబాతబస్సుం, మండల టాపర్, మాచారెడ్డి

ప్రభుత్వ పథకాల్లో అక్రమాలను సహించను

- ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌గా మహమ్మద్ నగర్ మండలం
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస్, కల్యాణలక్ష్మితో పాటు పలు ప్రభుత్వ పథకాల్లో అక్రమాలను సహించబోనని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సంక్షేమ పథకాలను అమ్ముకునే నాయకులు రాజకీయాల్లో పనికిరారని హెచ్చరించారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటుతో మహమ్మద్ నగర్ మండలాన్ని ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌గా మారుస్తానన్నారు. కొత్తగా ఏర్పాటైన మహమ్మద్



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నగర్ మండల దశదిశను మార్చడం తన లక్ష్యమన్నారు. త్వరలోనే మండల కార్యాలయాల ఏర్పాటుకు భూమి పూజ చేస్తామన్నారు. మహమ్మద్ నగర్ మండలానికి 30 వేల మెట్రిక్ టన్నుల గిడ్డంగి మంజూరు చేశామని చెప్పారు. రూ. కోటి ఆరవై లక్షలతో సీసీ రోడ్లు వేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 248 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. పథకాల కోసం కార్యకర్తలను, నాయకులు మభ్యపెట్టవద్దన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డవారికి గుర్తింపు

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుర్తింపు లభిస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం లక్ష్యంగా గడప గడపకు పథకాలను తీసుకు వెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగురవేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పిట్లం వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి నాయకులు మల్లయ్యగారి ఆకాష్, సవాయిసింగ్, లోక్యానాయక్, నాగభూషణంగౌడ్, గొట్టం నర్సింలు, ఖాలిక్, రాజు తదితరులున్నారు.

మందుల్లేవు.. వైద్యులు రారు

నిజామాబాద్ నగరానికి చెందిన గంగవ్వ(58) ఈనెల 8వ తేదీన తన కొడుకుతో కలిసి కంఠేశ్వర్ ప్రాంతంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి బీపీ మందుల కోసం వచ్చింది. అక్కడి సిబ్బంది మందులు లేవని చెప్పడంతో వెనుదిరిగి వెళ్లిపోయింది.

కామారెడ్డికి చెందిన రమేశ్ అనారోగ్యంతో బాధపడుతూ న్యాల్‌కల్ రోడ్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రికి గురువారం వచ్చాడు. అయితే వైద్యులు లేకపోవడంతో ఏం చేయాలో తెలియక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లిపోయాడు.



ల్యాబ్ పరిస్థితి ఇలా...

- ఈఎస్ఐ ఆస్పత్రుల్లో అడుగడుగునా ఇబ్బందులు
- రోగులకు తప్పని ఇక్కట్లు
- ఇలా వచ్చి అలా వెళ్తున్న వైద్యులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

నిజామాబాద్‌నాగారం: ఆరోగ్యభద్రతను ఇస్తాయనుకున్న ఈఎస్ఐ ఆస్పత్రులు మందులు లేక, టైమ్‌కి వైద్యులు రాక వెలవెలబోతున్నాయి. ఉమ్మడి జిల్లా(నిజామాబాద్, కామారెడ్డి)కు సంబంధించి ఈఎస్ఐ ఆస్పత్రులు రెండు నిజామాబాద్ నగరంలోని రేడియోస్టేషన్ ప్రాంతంలో, కంఠేశ్వర్‌లో ఉన్నాయి. అయితే సంఘటిత, అసంఘటిత కార్మికులు, జీతాల్లో ఈఎస్ఐ కట్ అయ్యే చిన్నచిన్న ఉద్యోగులు వైద్య సేవలందక ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలలుగా ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందులు ఉండడం లేదని, వైద్యులు ఇలా వచ్చి అలా వెళ్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ తదితర దూర ప్రాంతాల నుంచి వస్తున్నవారు ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వశాఖల్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు సుమారు 2వేల మందికిపైగానే ఉన్నారు. వీరితోపాటు ప్రైవేట్ సంస్థల్లో ఆయా రంగాల్లో చిరుద్యోగులు, కార్మికులు సుమారు 13వేల వరకు ఉన్నారు. న్యాల్‌కల్‌రోడ్‌లో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రిలో 10వేల కార్డులు ఉండగా, ప్రతినిత్యం 80మందికిపైగా చికిత్స కోసం వస్తుండగా, కంఠేశ్వర్ ప్రాంతంలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రుల్లో 5వేలకు పైన కార్డులు ఉన్నాయి. ఇక్కడికి ప్రతిరోజూ 50 మందికి పైగా రోగులు వస్తున్నారు.



ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

బీపీ బిళ్లలూ ఉండవు..

ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా బీపీ, థైరాయిడ్, కొలస్ట్రాల్ తదితర మందులు లేవు. చిన్న పిల్లలకు సంబంధించిన మందులు సైతం ఉండడం లేదు. కేవలం జ్వరం, నొప్పుల మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఫార్మసిస్టులు చెబుతున్నారు.

పర్యవేక్షణ లేదు

రెండు ఈఎస్ఐ ఆస్పత్రులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. రెండు ఆస్పత్రులను కలెక్టర్ ఒకసారి సందర్శిస్తే ఇక్కడి పరిస్థితి, అందుతున్న వైద్య సేవల వివరాలు తెలుస్తాయని రోగులు అంటున్నారు. వైద్య సేవలపై ప్రశ్నిస్తే హైదరాబాద్‌లోని నాచారం, సనత్‌నగర్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తామని అంటున్నారని వాపోతున్నారు.

లంచ్‌కి వెళ్తే అటే..

ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యులు, సిబ్బంది కచ్చితంగా అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించాలి. కానీ ఉదయం వస్తున్న వారు లంచ్‌కి వెళ్తే మళ్లీ రావడం లేదు. డాటా ఎంట్రీ ఆపరేటర్లే ఫార్మసిస్టుల్లా మందులు ఇస్తున్నారు. రెండు ఈఎస్ఐ ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎక్స్‌రే, ఈసీజీ, ల్యాబ్‌ల నిర్వహణను పట్టించుకునే వారు లేరు.

40 ఫీట్ల రోడ్డు కబ్జాకు యత్నం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రామారెడ్డి రోడ్డులో సుభాష్ థియేటర్ ఎదురుగా ఉన్న మాస్టర్ ప్లాన్ ప్రకారం 40 ఫీట్ల రోడ్డును ఓ వ్యక్తి కబ్జాకు యత్నిస్తున్నాడు. గతంలో ఈ రోడ్డులో భవన నిర్మాణ పనులు ప్రారంభించగా అప్పటి టీపీవో నోటీసులు జారీ చేసి కూల్చివేయించారు. ఈ రోడ్డు స్థలం తనదేనంటూ హద్దురాళ్లు వేసి సదరు వ్యక్తి మళ్లీ కబ్జాకు యత్నిస్తున్నాడు. దీంతో స్థానిక కాలనీవాసులు ఈ రోడ్డుగుండా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. టీపీవో గిరిధర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజులుగా రోడ్డుకు అడ్డంగా రాళ్లు అలానే ఉన్నాయి. ఈ విషయమై సాక్షి టీపీవోను వివరణ కోరగా సదరు వ్యక్తికి రెండు సార్లు నోటీసులు జారీ చేశామని, క్రిమినల్ కేసు నమోదు చేయిస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై తుది విచారణ



నాగిరెడ్డిపేట : మండలంలోని వదల్‌పర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపికచేసిన లబ్ధిదారుల జాబితాపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో సురేందర్, ఎంపీడీవో ప్రభాకరచారి, ఎస్సై మల్లారెడ్డి సమక్షంలో జీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఇళ్లకు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను వివరించారు. 17మంది లబ్ధిదారుల జాబితాను పరిశీలించి, ఏడింటిని రిజెక్ట్‌చేసి 10మందిని ఎంపిక చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ పిచ్చయ్య, జీపీకార్యదర్శి అజీమొద్దీన్ తదితరులున్నారు.

ఆసక్తి, అర్హత ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లు

బాన్సువాడ రూరల్ : ఆసక్తి ఉండి, అర్హతలు ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని బాన్సువాడ ఎంపీడీవో ముజాహిద్ సూచించారు. శుక్రవారం ఆయన బాన్సువాడ మండలం బోర్లంక్యాంపులో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే చేపట్టారు. జీపీ కార్యదర్శి పరిపూర్ణ, కారోబార్ వినయ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంజీవ్‌రెడ్డి, షబ్బీర్, పీర్యానాయక్, సంత్యాలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని గుండెకల్లూర్‌లో ఎంపీడీవో గోపాల్ ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులు ముందుకు రావాలని కోరారు. గుండెకల్లూర్ గ్రామానికి 111 ఇళ్లు మంజూరు అయ్యాయని, 17 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి తెలిపారు. ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులకు ఇసుక సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

క్రైం కార్నర్

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

రుద్రూర్: మండల కేంద్రంలో నాలుగు రోజుల క్రితం పోలీసులు డ్రంకన్ డ్రైవ్, వాహనాల తనిఖీలు చేపట్టారు. బొప్పపూర్ గ్రామానికి చెందిన సాయిలు, రానంపల్లి గ్రామానికి చెందిన వీరేశంలు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. శుక్రవారం వారిని కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒకరికి మూడురోజుల జైలు, మరొకరికి రెండు రోజుల జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

సిలిండర్ లీకై మంటలు



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని రాజనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న గందం గంగామణి ఇంట్లో శుక్రవారం సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు స్పందించి మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇంట్లో మంటలు వ్యాపించడంతో విలువైన సామగ్రి, నిత్యవసర సరుకులు కాలిపోయాయి.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



రాజంపేట: మండలంలోని షేర్ శంకర్ తండాలో విద్యుత్ షాక్‌తో ఓ ఆవు మృతి చెందింది. తండాలోని రైతు కాట్రోత్ సురేందర్‌కు చెందిన ఆవు శుక్రవారం ఉదయం గ్రామ శివారులో మేతకు వెళ్లగా సమీపంలోని విద్యుత్ వైర్ల కర్ర విరిగిపడగా, కర్రకు కట్టిన విద్యుత్ తీగలు ఆవుపై పడటంతో షాక్‌తో మృతిచెందింది. సుమారు రూ. 50వేల వరకు నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం/సదాశివనగర్(ఎల్లారెడ్డి): పాత గొడవలను మనసులో పెట్టుకుని వ్యక్తిని హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా.. సదాశివనగర్ మండలం మర్కల్ వద్ద జాతీయ రహదారి పక్కన కల్వర్టు కింద 2020 జూలై 13న ఓ మృతదేహం ఉందని సమాచారం రావడంతో పోలీసులు విచారణ జరిపి మృతుడిని సదాశివనగర్‌కు చెందిన మాడల సతీష్‌గా గుర్తించారు. అతనికి, అదే గ్రామానికి చెందిన గోల్కొండ రవి కుమార్‌కు మధ్య గొడవలు ఉండేవి. సతీష్ తరచుగా రవి కుమార్‌ను, అతని కుటంబ సభ్యులను తిడుతుండేవాడు. దీంతో అతడిని ఎలాగైనా చంపాలని రవి నిర్ణయించుకున్నాడు. అదే సంవత్సరం జూలై 10న రవి ఆర్మూర్ దాకా వెళ్లి వద్దామని అతడిని నమ్మించాడు. సదాశివనగర్ మండల కేంద్రం శివారులోని కామారెడ్డి వైపునకు వెళ్తున్న మార్గమధ్యలో రహదారిపై ఉన్న కల్వర్టు వద్దకు తీసుకెళ్లి కూర్చోబెట్టి ఆ తర్వాత వంతెన పైనుంచి కిందికి తోసి వేశాడు. దీంతో సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రవీందర్ కల్వర్టు కిందికి వెళ్లి గాయాలతో కొట్టుకుంటున్న సతీష్‌ను రాయితో తలపై కొట్టి హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జిల్లా న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ నిందితుడికి జీవిత ఖైదుతోపాటు, రూ.2వేల జరిమానా విధిస్తు తీర్పు ఇచ్చారు. అప్పటి సదాశివనగర్ సీఐం వెంకట్, ఎస్సై జగడం నరేశ్, ప్రస్తుత సీఐ సంతో ష్‌కుమార్, ఎస్సై రంజీత్‌లను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

బైక్ చోరీల కేసులో నిందితుడి అరెస్టు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): చెడు వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్, సీఐ సురేష్ తెలిపారు. మోపాల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వారు కేసు వివరాలను వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని వివేకానంద కాలనీకి చెందిన భూమిగారి నవీన్, తల్లి రాజేశ్వరితో కలిసి నివాసం ఉంటున్నాడు. కూలీ పని చేసుకునే క్రమంలో చెడు వ్యసనాలకు బానిసై ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడేవాడు. పలు కేసుల్లో గతంలో జైలు జీవితం గడిపాడు. జైలు నుంచి బయటకు వచ్చిన అతడు కొన్ని నెలలుగా బతుకుదెరువు కోసం ఆటో నడుపుకుంటున్నాడు. కానీ ఆదాయం సరిపోకపోవడంతో మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈనెల 5న రోటరీనగర్‌లో బైక్ చోరీ చేసి, అదేరాత్రి మంచిప్ప శివారులోగల గండి మైసమ్మ ఆలయంలో,



నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ముదక్‌పల్లిలోని సూదులమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డాడు. అలాగే ఇంటి ఆవరణలో పెట్టిన బైక్‌ను చోరీ చేశాడు. బైక్‌లను శుక్రవారం తరలిస్తున్న క్రమంలో మోపాల్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాలను ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు. ఏఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది దూప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో..

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బోధన్ బస్టాండ్ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా, బైక్ చోరీ నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా.. ఆర్మూర్‌లోని పెర్కిట్‌కు చెందిన సుల్తాన్ మోహిముద్దీన్ ఈనెల 7న రాత్రి తన బైక్‌ను నగరంలోని ప్రగతి హాస్పిటల్ ఎదుట పార్క్‌చేశాడు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి బైక్ కనబడకపోవడంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో పోలీసులు బోధన్ బస్టాండ్‌లో వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకున్నారు. అతడిని విచారించగా డిచ్‌పల్లి మండలం నడిపల్లిలోని గాంధీనగర్‌కు చెందిన



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సయ్యద్ మజద్‌గా గుర్తించారు. ఇతడు గతంలో మూడుసార్లు బైక్‌లు దొంగతనం చేసినట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి నాలుగు కేసులకు సంబంధించి బైక్‌లను రికవరీ చేసినట్లు చెప్పారు. కోర్టులో హాజరు పర్చగా, కోర్టు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు చెప్పారు.

ఆటో బోల్తాపడి ఆరుగురికి గాయాలు



ఎల్లారెడ్డిలో బోల్తాపడిన ఆటో

ఎల్లారెడ్డి: బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తాపడటంతో ఆటోలోని ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డిలో ప్రయాణికులను ఎక్కించుకొని ఓ ఆటో రుద్రారం బయలుదేరింది. పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఆటోకు ఎక్సెల్ వాహనం అడ్డురావడంతో దానిని తప్పించబోయి బ్రేక్ వేయడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నిజాంసాగర్‌కు చెందిన రజిత, సుమలత, ఎల్లారెడ్డి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన సంగవ్వ, మల్కాపూర్ గ్రామానికి చెందిన శేర్ల చంద్రయ్య, శకుంతల, లక్ష్మీలకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. క్షత గాత్రులను మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పరామర్శించారు.

బైక్ అదుపుతప్పి ముగ్గురికి..



ఘటనస్థలంలో క్షతగాత్రులు

మద్నూర్(జుక్కల్): మండలంలోని మేనూర్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం బైక్ అదుపు తప్పడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. పిట్లం నుంచి మద్నూర్ వైపు బైక్‌పై ముగ్గురు వ్యక్తులు బయలుదేరారు. మేనూర్ వద్ద వారి బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌కు ఢీకొన్నారు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వారిని మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. సిద్దిపేట్ జిల్లా సూర్యపేట గ్రామానికి చెందిన బండి బిక్షపతి(65) కొన్ని సంవత్సరాలుగా అంకాపూర్‌లో కూలీ పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. కాగ రోజూ మాదిరి గానే శుక్రవారం ఉదయం కూలీ పనికి వెళుతున్నాంటూ ఇంట్లో నుంచి వెళ్లాడు. కాగ వ్యవసాయ క్షేత్రంలోనే భిక్షపతి చెట్టుకు ఉరి వేసుకొని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పిట్లం మండలంలో..



పిట్లం(జుక్కల్): మద్యానికి బానిసై తాగిన మైకంలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాంపూర్ గ్రామంలో చొటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా.. రాంపూర్ గ్రామానికి చెందిన కమ్మరి రాజు (33) గత కొంతకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి తాగిన మైకంలో ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బాన్సువాడ రూరల్: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బాన్సువాడ పట్టణానికి చెందిన గూడ సంతోష్ కుమార్(45) గురువారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. బాన్సువాడ–బీర్కూర్ రహదారిపై కొల్లూర్ రైస్ మిల్ సమీపంలో అతడికి మరో బైక్ ఎదురుగా రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో సంతోష్‌కు తీవ్రగాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్: మండల కేంద్రానికి చెందిన షేక్ సలీం(28) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఏఎస్సై సిద్దిఖీ శుక్రవారం తెలిపారు. ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిన సలీం ఇంతవరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.